సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

# అద్దంలా సర్వీసు రోడ్లు




మల్కాపురం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో రోడ్డు

- రూ.1.50 కోట్లతో సర్వీసు రోడ్డు ఆధునికీకరణ
- రూ.80 లక్షలతో కల్వర్టుల అభివృద్ధి
- ఇది మన ప్రాంతమేనా అని ఆశ్చర్యపోతున్న వైనం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న పారిశ్రామిక ప్రాంత వాసులు

మల్కాపురం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో రోడ్డు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో సర్వీసురోడ్లు అద్దంలా మెరుస్తున్నాయి. నాడు గుంతలు, పిక్క తేలి అధ్వానంగా ఉండేవి.నేడు కోట్ల రూపాయలతో ఆధునికీకరించడంతో సర్వీసు రోడ్లు సుందరంగా ఉన్నాయి. నేడు జరిగిన అభివృద్ధిని చూసి విమర్శకులు సైతం ముక్కున వేలు వేసుకుంటున్నారు.

**ఇదీ పరిస్థితి**

సింథియా నుంచి మల్కాపురం మీదుగా గాజువాక ఆర్టీసీ డిపో వరకు సర్వీసు మార్గాలు చాలా అధ్వానంగా ఉండేవి. పిక్క తేలి,రంధ్రాలు ఏర్పడ్డాయి. పలు చోట్ల కేబుల్ వైర్ల కోసం,ఇంటర్‌నెట్ కోసం తవ్విన గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో రాకపోకలకు అవస్థలు పడేవారు. సమస్యను తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ జీవీఎంసీ కమిషనర్, మేయర్‌లతో మాట్లాడి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో స్పందించిన వారు సుమారు రూ.1.50 కోట్లతో సుమారు నాలుగు కిలో మీటర్ల వరకు సర్వీసు రోడ్డును ఆధునికీకరించారు. అలాగే సుమారు 5 కిలో మీటర్ల వరకు సర్వీసురోడ్డుకు ఇరువైపులా గల ఫుట్ పాత్‌లను రూ. 80 లక్షలతో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం సర్వీసు రోడ్లు, ఫుట్‌పాత్‌లను చూస్తుంటే విదేశీ రోడ్లను తలపించే విధంగా ఉన్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.







ఆధునికీకరణ తర్వాత అద్దంలా సర్వీసు రోడ్డు




సింథియా నుంచి మల్కాపురం సర్వీసు రోడ్డు దుస్థితి

### అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం



సమస్య ఎక్కడ ఉన్నా తక్షణం పరిష్కరించే విధంగా పని చేస్తున్నాను.పారిశ్రామిక ప్రాంతంలోని సర్వీసు రోడ్ల దుస్థితిని స్వయంగా గమనించాను.వెంటనే అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన రోడ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకున్నాం. త్వరలో షో ల్యాంప్స్,సెంటర్ల పలు మొక్కలతో సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దే చర్యలు తీసుకుంటాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

### ఎంతో సౌకర్యంగా ఉంది



నాడు గుంతల గుంతులుగా ఉన్న పారిశ్రామిక ప్రాంతం రోడ్లు అధ్వానంగా ఉండేవి. నేడు అద్దంలా మెరుస్తున్నాయి. రోడ్లను చూస్తే ముచ్చట వేస్తుంది. నాడు ఈ మార్గంలో ప్రయాణం నరకం సౌకర్యవంతంగా ఉంది .

– రేవళ్ల సత్యనారాయణ, శ్రీహరిపురం

### చాలా ఆనందంగా ఉంది



నాడు పిక్క తేలి ఉన్న రోడ్లు నేడు సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ రోడ్లు చూస్తుంటే విదేశీ రోడ్లను చూస్తున్నట్టు అనిపిస్తుంది.ఇక్కడ సర్వీసురోడ్లును ఆధునికీకరించిన అధికారులకు,పాలకులకు మా గ్రామం తరఫున కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం.

– చట్టి వినయ్‌యాదవ్, వెంకన్నపాలెం

### వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గిట్టని వారు విమర్శలను తిప్పికొట్టే మాదిరిగా నేడు పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి జరుగుతోంది. గతంలో ఏ నాయకుడు ఇలాంటి చర్యలు చేపట్టలేదు. అసలు అభివృద్ధి కోసం ఆలోచించలేదు. ఆడారి ఆనంద్‌కుమార్ సమన్వయకర్తగా వచ్చిన రెండేళ్లలో పారిశ్రామిక నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టాయి. జరిగింది.

– సర్వసిద్ధి పైడిబాబు, మల్కాపురం

## ప్రశ్నించే తత్వం పెరగాలి




మాట్లాడుతున్న ఐఆర్‌ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్

సీతంపేట : జీవితం కోసమే చదువు అని కాకుండా, జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా మన పిల్లలను తయారు చేయాలని ఐఆర్‌ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో పిల్లల విద్యలో రావలసిన మార్పులు అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, నేటి చాట్ జీపీటీ యుగంలో ఒట్టి జ్ఞాపక శక్తి, బట్టీ చదువులకు చోటే లేదన్నారు. మార్కులు, ర్యాంకులపై వేలం వెర్రి తగ్గాలని సూచించారు. చిన్నతనం నుంచే ఇష్టమైన హాబీలు అలవర్చుకోకుంటే జీవితం యాంత్రికం అయిపోతుందన్నారు. పిల్లలు రోజూ ఆంగ్ల దినపత్రిక చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పిల్లల్లో అనేక రకాల మేధో కుశలతలు ఉంటాయని, ప్రతి విద్యార్థిని ఒక ప్రత్యేక వ్యక్తిగా చూడాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సదస్సులో చర్చించిన విషయాలు, విద్యా విధానంలో రావాల్సిన మార్పుల గురించి పాఠశాలలకు ఉపయోగపడేలా నిర్దిష్ట ప్రణాళిక తయారు చేయనున్నట్టు తెలిపారు.

## ఎర్నిమాంబ వార్షిక జాతర పోస్టర్ ఆవిష్కరణ

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఎర్నిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే వాసుపల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారని, వారికి మౌలిక వసతులు, ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## క్లుప్తంగా

### అతిగా మద్యం తాగి యువకుడి మృతి



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది

అల్లిపురం : అతిగా మద్యం సేవించి యువకుడు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం మల్కాపురం గాంధీగ్రామ్‌లో నివస్తున్న పి.జేమ్స్‌రాజ్ (30) హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో బ్లాస్టింగ్ కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగి నగరానికి చేరుకున్నాడు. డాబాగార్డెన్స్ దరి భీమ్‌నగర్‌లో గల నిరాశ్రయ వసతి గృహం సమీపంలో రోడ్డుపై పడిపోయాడు. ఈ విషయాన్ని స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంగవరం పోర్టులో ఉద్యోగికి అస్వస్థత

పెదగంట్యాడ: గంగవరం పోర్టులో పని చేస్తున్న ఓ ఉద్యోగి ఆదివారం అస్వస్థతకు గురవడంతో, ఆస్పత్రికి తరలించారు. వివరాలివి.. గంగవరం గ్రామానికి చెందిన అర్జల అమ్మోరు (45) గంగవరం పోర్టులో 16 ఏళ్లుగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం ఉదయం ఏ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లిన అమ్మోరు ఒక్కసారిగా అక్కడ కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే అతన్ని ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించేందుకు పోర్టు అధికారులు సిద్ధం చేయగా.. తోటి కార్మికులు అడ్డుకుని, ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ ఏసీపీ మోజెస్ పాల్, న్యూపోర్టు సీఐ దాలిబాబు సిబ్బందితో అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఆపై ఏసీపీ మోజెస్ పాల్ స్వయంగా 108 వాహనంలో బాధితుడిని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అమ్మోరు అక్కడ చికిత్స పొందుతున్నారు.

### ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా దేశ ప్రజలందరూ ఏకమై కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1109వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివాదా లు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు విషయంలో ప్రజలందరూ కేంద్రప్రభుత్వాన్ని నిలదీయాలన్నా రు. సంస్థ కోసం కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రంలో చలనం లేకపోవడం దారుణమన్నారు.

**రేపు పాదయాత్ర**

ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో పాటు దేశప్రజలంతా మమేకమై పాల్గొనాలని కోరారు. ఈ నెల 27న కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి జీవీఎంసీ దీక్ష శిబిరం వరకు జరిగే పాదయాత్రలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ‘పశ్చిమ’ అభివృద్ధికి పెద్దపీట

- ఆడారి ఆనంద్‌కుమార్
- నూతన టాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



గాంధీజీవీధిలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింథియా: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. జీవీఎంసీ 62వ వార్డు గాంధీజీవీధిలో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నగరపరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. 62వ వార్డులో సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, కల్వర్టులు వంటి నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. అనంతరం వార్డు పరిధిలోని త్రినాథపురంలో సుమారు రూ. 20 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ విభాగ కార్యదర్శి నూకరెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన వర్గాల పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ ‘పశ్చిమ’ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- గౌరీ శెట్టిబలిజ సేవాసంఘం సభ్యులతో ఆత్మీయ సమావేశం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆనంద్‌కుమార్

సింథియా: వెనుకబడిన వర్గాలను అభివృద్ధిలోకి తేవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో ఆదివారం గౌరీ శెట్టిబలిజ సేవా సంఘం సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెనుకబడిన సామాజిక వర్గాల అభివృద్ధికి సీఎం జగన్ చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పనులను వివరించారు. చేతివృత్తులు అంతరించిపోకూడదనే లక్ష్యంతో రాష్ట్రంలోని ఒక్కో సామాజిక వర్గానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు సూర్యనారాయణ, ఎస్. సత్యనారాయణ, చంటి, గౌరీ శెట్టిబలిజ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయాత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు రోడ్ల మీద కాకుండా సెల్లార్ పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. నగరంలో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేయడం జరుగుతుందని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌నకు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే సెక్షన్ 190ఏ మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు.

## బౌద్ధంతోనే అసమానతలు దూరం

సీతంపేట : బౌద్ధ ధర్మం ద్వారా అసమానతలు దూరం చేయవచ్చని పలువురు బౌద్ధ మేధావులు పేర్కొన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 11వ బౌద్ధ మహా సమ్మేళనం నిర్వహించారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో డాక్టర్ ఆయాపాల మయతెరో (మయన్మార్) సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసెఫ్ జాతీయ నాయకుడు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి.నటరాజ్ సౌఖ్య, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు ప్రసంగించారు.

## వెంకన్నకు విశేషంగా పుష్పయాగం

- పరవశించిన భక్తజనం
- ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. స్వామివారికి శ్రీపుష్పయాగం, ఊంజల్‌సేవ విశేషంగా నిర్వహించారు. భక్తులు కనులారా ఈసేవలను తిలకించి పులకించిపోయారు. వెవెంకన్న, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని మండపంలో అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, చక్రాబ్య మండల అర్చన, పాలికా అర్చన, ద్వాదశ ఆరాధనను విశేషంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామికి పుష్పాంజలి సేవ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పూజలను పర్యవేక్షించారు.

# ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న క్రైం ఏడీసీపీ గంగాధర్



పరీక్షలకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం: గోపాలపట్నం ఆదిత్య కళాశాలలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయమే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. వీరిని పోలీసులు, పరీక్షల నిర్వాహకులు తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. అభ్యర్థుల సెల్ ఫోన్లు డిజిటల్ వస్తువుల్ని లోపలికి అనుమతించలేదు. ఈ కేంద్రంలో మొత్తం 480 మందికి గానూ 426 మంది హాజరయ్యారు. ఈ కేంద్రాన్ని క్రైం ఏడీసీపీ గంగాధర్ పరిశీలించారు.

# సుదర్శన నారసింహ మహాయజ్ఞానికి భూమిపూజ

వచ్చే నెల 26 నుంచి యజ్ఞం ప్రారంభం



భూమి పూజలో భాగంగా యజ్ఞశాల ప్రదేశంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: లోక కల్యాణార్థం సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వతేదీ వరకు నిర్వహించనున్న చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి ఆదివారం భూమిపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహగిరిపై ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రదేశంలో కార్యక్రమం వైభవంగా చేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు ఆవాహనం, వాస్తు పురుష ఆవాహనం, వాస్తు కలశ ఆవాహనం నిర్వహించారు. అనంతరం నాగలి, ఎద్దులకు పూజలు చేశారు. ఏడుసార్లు కర్షణం(భూమిని దున్నే కార్యక్రమం) నిర్వహించారు. యాగభూమిని శుద్ధి చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు , దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, వంకాయల సాయినిర్మల సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ లోకం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో సింహగిరిపై పెద్ద ఎత్తున సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహించ తలపెట్టినట్టు చెప్పారు. 50 మంది రుత్వికులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మార్చి 26న ఉదయం రుత్విక్ వరణం, సాయంత్రం అంకురార్పణతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. 27 ఉదయం అగ్నిప్రతిష్ఠ ఉంటుందన్నారు. ఏప్రిల్ 1 ఉదయం పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో యజ్ఞం ముగుస్తుందన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని తరించాలని కోరారు. యజ్ఞంలో పాల్గొనే భక్తుల విధి విధానాలను త్వరలో ప్రకటించనున్నట్టు తెలిపారు.

## స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ సానుకూల ప్రకటన చేయాలి



పెదగంట్యాడ జంక్షన్ నుంచి పాదయాత్ర చేస్తున్న అఖిల పక్షాల నాయకులు

పెదగంట్యాడ: వచ్చే నెల 1న విశాఖ పర్యటనకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ.. ‘విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుంది’ అని ప్రకటన చేయాలని అఖిల పక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ పిలుపు మేరకు ఐఎస్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు వరకు ఆదివారం ఉదయం మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1100 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అదానీకో, అంబానీకో స్టీల్‌ప్లాంట్‌ను ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. పెదగంట్యాడ జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర సిద్ధేశ్వరం, దల్లివానిపాలెం, కోరాడ, సీతానగరం, బాలచెరువు, నెల్లిముక్కు మీదుగా నడుపూరు వరకు సాగింది. కార్యక్రమంలో అనిపెద్ది మసేనురావు, నీరుకొండ రామచంద్రరావు, రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, గొందేశి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com